సాక్షి
కామారెడ్డి

ఆదివారం । 7 । జూలై । 2024



మొక్కలతోనే మనుగడ

మొక్కలను నాటి సంరక్షిస్తేనే పర్యావరణం బాగుంటుందని అప్పడే మానవజాతి మనుగడ సాధ్యమని జుక్కల్ ఎమ్మెల్యే పేర్కొన్నారు.

- 8లో ▸



సార్‌ను బదిలీ చేయొద్దు

రాజంపేట మండలంలోని శివాయిపల్లి గ్రామస్తులు బదిలీ అయిన ఉపాధ్యాయుడు స్వామిని తిరిగి పంపాలని ధర్నా చేశారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
35.4 /23.4

వాతావరణం

ఆకాశం మేఘావృతమవుంది. ఈదురు గాలులు వీస్తాయి. జిల్లాలోని పలుచోట్ల మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

సీఎంఆర్ సకాలంలో పూర్తి చేయాలి

● కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



కామారెడ్డి క్రైం: రైస్ మిల్లుల యజమానులు సీఎంఆర్‌ను సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. అధికారులు, రైస్‌మిల్లర్లతో కలెక్టరేట్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఇప్పటి వరకు సీఎంఆర్ ప్రారంభించని రైస్ మిల్లర్లకు నోటీసులు ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. మిల్లింగ్ సకాలంలో చేపట్టకపోతే సదరు మిల్లులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. 2021–22, 2022–23 ఖరీఫ్ సీజన్లలో వడ్లు తీసుకుని ప్రభుత్వానికి బియ్యం ఇవ్వకుండా మిగిలిపోయిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. వారంతా మూడు నెలల్లోగా బియ్యం రూపంలో గానీ, నగదు రూపంలో గానీ తిరిగి ఇవ్వాలని ఆదేశించారు. లేదంటే క్రిమినల్ కేసులు నమోదు చేసి ఆర్‌ఆర్ యాక్ట్ ప్రకారం ఆస్తులు జప్తు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో ఇన్‌చార్జి డీఎం నిత్యానందం, అధికారులు పాల్గొన్నారు.

హైకోర్టు న్యాయమూర్తికి ఘన స్వాగతం



కామారెడ్డి క్రైం: హైకోర్టు న్యాయమూర్తి, రాష్ట్ర న్యాయ సేవల ప్రాధికార సంస్థ కార్యనిర్వాహక చైర్మన్ సుజోయ్ పాల్, తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవల ప్రాధికార సంస్థ మెంబర్ సెక్రెటరీ పంచాక్షరిలు శనివారం నిజామాబాద్‌కు వెళ్తూ కామారెడ్డిలో ఆగారు. ఆర్ అండ్‌బీ అతిథి గృహం వద్ద వారికి కామారెడ్డి జిల్లా జడ్జి డాక్టర్ సీవీఆర్‌ఆర్ వరప్రసాద్ స్వాగతం పలికారు. అనంతరం అతిథిగృహంలో న్యాయాధికారులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో అదనపు జిల్లా జడ్జి లాల్‌సింగ్ శ్రీనివాస నాయక్, కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, సీనియర్ సివిల్ జడ్జి నాగరాణి, జూనియర్ సివిల్ జడ్జిలు టి.సుధాకర్, దీక్ష, డీఎస్పీ నాగేశ్వర్‌రావు, ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

9న తెయూలో జాబ్‌మేళా

తెయూ(డిచ్‌పల్లి) : తెలంగాణ యూనివర్సిటీలో పీజీ ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థులకు ఈ నెల 9న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు వర్సిటీ ప్లేస్‌మెంట్ డైరెక్టర్ పాత నాగరాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ యూనివర్సిటీ, తెలంగాణ అకాడమీ ఆఫ్ స్కిల్ అండ్ నాలెడ్జ్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో డీఎస్ టెక్నాలజీస్ కంపెనీలో టెక్నికల్ రిక్రూటర్, బిజినెస్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్, డిజిటల్ మార్కెటింగ్ ఖాళీల భర్తీకి జాబ్ మేళా నిర్వహించనున్నట్లు వివరించారు. ఈ మేళాలో అభ్యర్థులకు పీఐఆర్ (వ్యక్తిగత పరిచయ రౌండ్), గ్రూప్ డిస్కషన్, ఎఫ్2ఎఫ్ (ముఖాముఖి) వంటి రౌండ్‌లతో ఇంటర్వ్యూ నిర్వహిస్తారని తెలిపారు. పీజీ ఫైనల్ ఇయర్ చదువుతున్న ఆసక్తి గల విద్యార్థులందరూ ఈ నెల 8లోపు వర్సిటీ ప్లేస్‌మెంట్ సెల్‌లో వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు.

డీఎస్ మృతిపై సోనియా గాంధీ సంతాపం

ఖలీల్‌వాడి : పీసీసీ మాజీ అధ్యక్షుడు, మాజీ మంత్రి డి శ్రీ నివాస్ మృతిపై కాంగ్రెస్ అగ్ర నేత సోనియాగాంధీ సంతాపం తెలిపారు. మాజీ మేయర్ ధర్మపురి సంజయ్‌కు ఆమె సంతాప లేఖ పంపించా రు. డీఎస్ మృతితో పార్టీ మంచి నేతను కో ల్పోయిందని లేఖలో పేర్కొన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

బోర్గాం(పి) పాఠశాలపై ఎస్‌సీఆర్‌ఈటీ సంచికలో కథనం

మోపాల్ : బోర్గాం(పి) జెడ్పీ ఉన్నత పాఠశాలపై విద్యాశాఖలోని ఎస్‌సీఈఆర్‌టీ (స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రెనింగ్) సంచిక (హర్బింగర్స్ ఆఫ్ చేంజ్)లో కథనం ప్రచురితమైంది. ఈ పాఠశాలకు గత ఎనిమిదేళ్లుగా జిల్లాస్థాయిలోనే కాకుండా రాష్ట్రస్థాయిలో గుర్తింపు ఉంది. పాఠశాలలో ప్రతియేటా సగటున వెయ్యికిపైనే విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. విద్యార్థుల సంఖ్య ప్రతియేటా పెరగడం, మౌలిక సదుపాయాలు కల్పన, క్రమశిక్షణ, చదువుకు ప్రాముఖ్యత, కంప్యూటర్ విద్యతోపాటు గతంలో పనిచేసి రిటైర్డ్ అయిన ముగ్గురు హెచ్‌ఎంలు గంగారెడ్డి, సత్యనారాయణ, రామారావుకు రాష్ట్రపతి చేతుల మీదుగా జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకోవడం, వంటి అంశాలను ప్రస్తావించారు.

సంక్షేమం.. అధ్వానం!

- ప్రభుత్వ హాస్టళ్లలో సమస్యలతో విద్యార్థులు సతమతం
- అస్తవ్యస్తంగా స్నానాల గదులు, మరుగుదొడ్లు
- శిథిలావస్థల్లో భవనాలు
- పట్టించుకోని అధికారులు
- 'సాక్షి' పరిశీలనతో వెలుగు చూసిన సమస్యలు



పెద్దకొడప్‌గల్ ఎస్సీ హాస్టల్‌లో స్నానాల గదులు లేక బయట స్నానాలు చేస్తున్న విద్యార్థులు

SAKSHI సాక్షి విజిట్ VISIT

కామారెడ్డి టౌన్: ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లు అధ్వానంగా మారాయి. అనేక సమస్యల నడుమ కొట్టుమిట్టాడుతున్నాయి. కనీస సౌకర్యాలు కరువై విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. అయినా వసతిగృహాల్లో సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వం, అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. 'సాక్షి' బృందం శనివారం జిల్లా వ్యాప్తంగా ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లను పరిశీలించగా చాలా సమస్యలు వెలుగుచూశాయి.

జిల్లాలో 76 హాస్టళ్లు..

జిల్లాలో బీసీ సంక్షేమ హాస్టళ్లు 26 ఉండగా వాటిలో ప్రీమెట్రిక్ 18, పోస్ట్ మెట్రిక్ 8 ఉన్నాయి. ఎస్సీ హాస్టళ్లు 30 ఉండగా వాటిలో ప్రీమెట్రిక్ 26, పోస్ట్ మెట్రిక్ 4 ఉన్నాయి. ఎస్టీ హాస్టళ్లు 11 ఉండగా వాటిలో ప్రీమెట్రిక్ 7, పోస్ట్ మెట్రిక్ 4 ఉండగా.. మైనారిటీ హాస్టళ్లు తొమ్మిది ఉన్నాయి. వీటిలో మొత్తం 12 వేలకు పైగా మంది విద్యార్థులు చదువుతున్నారు.

సమస్యలతో సతమతం

జిల్లా కేంద్రంలోని బీసీ బాలుర హాస్టల్ భవనం శిథిలావస్థలో ఉంది. అంతేకాకుండా విద్యార్థులకు సరిపడా బాత్‌రూంలు లేవు. ఉన్నవి కూడా శిథిలావస్థలో ఉండడంతో పెచ్చులూడుతున్నాయి. సెప్టిక్ ట్యాంక్ స్లాబ్ సైతం ప్రమాదకరంగా మారింది. ఎస్సీ బాలుర హాస్టల్‌లో గదులు సరిపోక వరండాలో మంచాలపై విద్యార్థులు పడుకుంటున్నారు.

ధ్వంసమైన తలుపులు, పెచ్చులూడుతున్న భవనాలు..

నస్రుల్లాబాద్‌లో ఎస్టీ బాలుర గురుకుల వసతి గృహంలో నేలపైనే కూర్చుని విద్యార్థులు చదువులు సాగిస్తున్నారు. స్నానాల గదులకు తలుపులు ధ్వంసమయ్యాయి. దీంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పడంలేదు. మద్నూర్ బాలికల వసతి గృహంలో బాత్‌రూంలు శుభ్రం చేయకపోవడంతో విద్యార్థులు జారి పడుతున్నారు. బీసీ హాస్టల్‌లో కులాయి నీరే తాగాల్సిన పరిస్థితి ఏర్పడింది. పిట్లం ఎస్సీ బాలుర హాస్టల్ ఆవరణలో మురికినీరు నిలుస్తోంది. మరుగుదొడ్లు సరిగ్గా లేవు. గదులకు దోమతెరలు లేకపోవడంలో దోమలు, ఈగలు స్వైరవిహారం చేస్తున్నాయి. ఎస్టీ హాస్టల్ భవనం పెచ్చులూడి పడుతున్నాయి. మురికి కాలువ లేకపోవడంతో మురుగు నీరు హాస్టల్ ఆవరణలో నిలిచిపోతోంది.



జిల్లా కేంద్రంలోని బీసీ హాస్టల్‌లో పెచ్చులూడుతున్న స్నానాల గదులు

స్నానాల గదులు, మరుగుదొడ్లు అధ్వానంగా ఉన్నాయి. ఎస్టీ హాస్టల్‌లో సైతం స్నానాల గదులు, మరుగుదొడ్లు అధ్వానంగా మారాయి. ఎల్లారెడ్డి పట్టణంలో బీసీ బాలుర హాస్టల్‌లో సరిపడా స్నానాల గదులు లేక ఆరుబయట స్నానాలు చేస్తున్నారు. ఎస్సీ బాలుర హాస్టల్‌లో ఇరుకు గదుల్లో చదువుకుంటున్నారు. పెద్దకొడప్‌గల్‌లో ఎస్సీ హాస్టల్‌లో స్నానాల గదులే లేకపోవడంతో ఆరుబయట స్నానాలు చేస్తున్నారు. బిచ్కుంద ఎస్సీ హాస్టల్‌లో అపరిశుభ్రంగా ఉన్న వంటగదిలో వంటలు చేస్తున్నారు. బియ్యం ఉడకకుండానే అన్నం పెట్టారు. బీబీపేట్‌లో వంద మంది విద్యార్థులకు సరిపడా గదువు లేవు. తాగు నీటి సౌకర్యం లేక నల్లా నీటినే తాగుతున్నారు.



పట్టణంలోని ఎస్సీ బాలుర హాస్టల్‌లో విరిగిన బాత్‌రూం తలుపులు

బాత్రుంలలో నీళ్లు రాక అవస్థలు

పాల్వంచ మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహంలో బాత్రుంలలో నీళ్లు రాక బయట నుంచి విద్యార్థులే నీళ్లు తీసుకెళ్తున్నారు. కొన్ని బాత్రుంలకు డోర్లు లేకపోవడంతో అవి నిరుపయోగంగా ఉన్నాయి. కూరగాయలు నిల్వ ఉంచడానికి ఫ్రిజ్ లేకపోవడంతో వారం రోజుల పాటు బయటే నిల్వ ఉంచుతున్నారు. దీంతో అవి కుళ్లిపోతున్నాయి. లింగంపేట ఎస్సీ హాస్టల్ ఆవరణలో చెత్త పేరుకుపోయింది. ఈగలు, పందులు, దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. గదుల పైకప్పు పెచ్చులూడుతున్నాయి.

దోమకొండలోని ఎస్సీ బాలుర హాస్టల్ చుట్టూ పిచ్చి మొక్కలు ఏపుగా పెరగడం, వర్షాకాలం కావడంతో పాములు, విషపురుగులు వస్తున్నాయని విద్యార్థులు తెలిపారు. టాయిలెట్లకు డోర్లు, కిటికీలకు జాలీలు లేకపోవడంతో విద్యార్థి ఇబ్బందులు పడుతున్నారు. అలాగే వాటర్ ప్యూరిఫైయర్ పనిచేయడం లేదు. తాడ్వాయిలోని బాలికల గురుకుల హాస్టల్‌లో వంటశాల కిటికీలకు అద్దాలు లేకపోవడంలో కోతులు ప్రవేశించి హంగామా సృష్టిస్తున్నాయి. ఇలా జిల్లా వ్యాప్తంగా చాలా హాస్టళ్లలో సమస్యలు వెలుగులోకి వచ్చాయి. ఇన్ని సమస్యలున్నా జిల్లా అధికారులు పట్టించుకోవడం లేరని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా స్పందించి వసతి గృహాల్లోని సమస్యలను పరిష్కరించాలని విద్యార్థులు కోరుతున్నారు.



దోమకొండ ఎస్సీ హాస్టల్‌లో పనిచేయని వాటర్ ప్యూరిఫయర్



పెద్దకొడప్‌గల్ ఎస్సీ హాస్టల్‌లో కిటికీలకు అద్దాలు లేకపోవడంతో డైనింగ్ హాల్‌లోకి కోతులు వస్తున్న

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



జీజీహెచ్ ఆస్పత్రిలో ల్యాబ్‌లో సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్ ఆర్‌వీ కర్ణన్

- ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన సేవలందించాలి
- రాష్ట్ర వైద్యారోగ్యశాఖ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్

కామారెడ్డి టౌన్: సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా వైద్య సేవలు అందించాలని రాష్ట్ర వైద్యారోగ్యశాఖ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిని శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలోని పలు వార్డులు, ల్యాబ్, స్కానింగ్ సెంటర్లను పరిశీలించారు. రోగులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభమైనందున సీజనల్ వ్యాధులు అధికంగా వచ్చే అవకాశం ఉందని ఆస్పత్రికి జ్వరాలతో వచ్చే ప్రతి ఒక్కరికి అవసరమైన వైద్యపరీక్షలు చేసి డెంగీ, మలేరియా, డయేరియా లాంటి వ్యాధులు వ్యాపించకుండా వైద్యసేవలందించాలని ఆదేశించారు. ఆస్పత్రిలో అన్ని రకాల ఆధునిక వైద్య పరికరాలు అందుబాటులో ఉన్నాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ప్రభుత్వ ఆస్పత్రిలో కార్పొరేట్ హాస్పిటల్‌కు దీటుగా వైద్య సేవలు అందించేందుకు అధికారులు కృషి చేయాలన్నారు.

అధికారులతో సమీక్ష

ఆస్పత్రిని తనిఖీ చేసిన అనంతరం కలెక్టరేట్‌లో వైద్యారోగ్య శాఖ, పంచాయతీరాజ్ శాఖ, జిల్లా సంక్షేమ అధికారి, మున్సిపల్ అధికారులతో కమిషనర్ సమీక్ష నిర్వహించారు. డెంగీ, మలేరియా, ఇతర సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామీణస్థాయి నుంచి జిల్లా స్థాయి అధికారులు పూర్తి సన్నద్ధతతో ఉండాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా ఆస్పత్రి పర్యవేక్షకురాలు విజయలక్ష్మి, డీపీవో శ్రీనివాస్, డీడబ్ల్యూవో బావయ్య పాల్గొన్నారు.

రక్త పరీక్షల నిర్వహణ తీరుపై ఆగ్రహం

ఆస్పత్రిలో డెంగీ, మలేరియా తదితర వ్యాధులకు సంబంధించి రక్త పరీక్ష యంత్రాలను వినియోగించకపోవడంపై వైద్యులు, సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. యంత్రాలను మూలన పడి దుమ్ముపట్టిపోతున్నాయని, రూ. కోట్ల విలువ చేసే యంత్రాలను ఇలాగే నా అని మండిపడ్డారు. పరీక్షల రిపోర్టులు ఆ న్‌లైన్‌లో కాకుండా ఆఫ్‌లైన్‌లో తయారుచేయడంపై అసహనం వ్యక్తం చేశారు. టీ హబ్ సాఫ్ట్‌వేర్‌లో తప్పకుండా ఆన్‌లైన్‌లో నమోదు చే యాలని సూచించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో చంద్రశేఖర్, డీసీహెచ్‌ఎస్ విజయలక్ష్మి, ఆస్పత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ బన్సీలాల్, ఆర్‌ఎంవోలు శ్రీనివాస్, సుజాత, వైద్యులు పాల్గొన్నారు.

అద్దాల మేడలో అరాచకం!

- ఆస్పత్రి అడ్డాగా శిశువుల విక్రయం
- అడ్డంగా బుక్కైన ప్రభుత్వ వైద్యుడు
- యథేచ్ఛగా లింగనిర్ధారణ పరీక్షలు, అబార్షన్లు
- ఒక్కోదానికి ఒక్కో రేటు

సాక్షి, కామారెడ్డి : అద్దాలమేడలాంటి ఆ భవనం అరాచకాలకు అడ్డాగా మారింది. లింగ నిర్ధారణ పరీక్షలు, అబార్షన్లే కాదు ఆఖరుకు శిశువుల విక్రయాలకు కేరాఫ్ అడ్రస్ అయ్యింది. కాసులకు కక్కుర్తిపడి అడ్డగోలు దందా నడుపుతూ ఓ ప్రభుత్వ వైద్యుడు అడ్డంగా బుక్కయ్యాడు. జిల్లా కేంద్రంలోని శ్రీరాంనగర్ కాలనీలో ఉన్న ఓ ప్రైవేటు ఆస్పత్రి కేంద్రంగా ఆడ శిశువును అమ్మినట్టు వచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. కేసులో ప్రభుత్వ వైద్యుడు ప్రవీణ్‌కుమార్, ఆయన తండ్రి నడిపి సిద్ధరాములుతో పాటు ఎనిమిది మందిని పోలీసులు అరెస్టు చేశారు. జిల్లా బాలల పరిరక్షణ కార్యాలయానికి సంబంధించి 1098 ద్వారా ఫోన్ చేసిన వ్యక్తి ఏప్రిల్ 14న సమన్విత ఆస్పత్రిలో పుట్టిన పాపను మాయం చేశారని తెలపడంతో జిల్లా బాలల పరిరక్షణ అధికారి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పట్టణ పోలీసులు కూపీ లాగి మొత్తం వ్యవహారాన్ని బయటకు తీశారు. కేసులో ఎనిమిది మందిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. కాగా రాష్ట్ర వైద్యారోగ్యశాఖ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ శనివారం కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించారు. అనంతరం సీజనల్ వ్యాధులపై కలెక్టరేట్‌లో వైద్యాధికారులతో రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోనే కామారెడ్డిలో అత్యధికంగా లింగనిర్ధారణ పరీక్షల్లో ఫేమస్ అని, దీనిపై దృష్టి సారించాలని జిల్లా అధికారులను ఆదేశించారు. అక్కడ రివ్యూ జరుగుతున్నప్పుడే శిశు విక్రయానికి సంబంధించిన కేసులో ప్రైవేటు ఆస్పత్రి నిర్వాహకులను అరెస్టు చేసినట్లు పోలీసులు ప్రకటించారు.



శిశువిక్రయం జరిగినట్లు చెబుతున్న ఆస్పత్రి భవనం

అప్పుడు కౌసల్య ఆస్పత్రి..

జిల్లా కేంద్రంలోని శ్రీరాంనగర్ కాలనీలో కౌసల్య ఆస్పత్రిలో లింగ నిర్ధారణ పరీక్షలు, భ్రూణ హత్యలు జరుగుతున్నాయన్న ఫిర్యాదుతో 2021 జూలై 14న వైద్య ఆరోగ్యశాఖ అధికారులు డెకాయ్ ఆపరేషన్ నిర్వహించారు. అప్పుడు ఆస్పత్రి నిర్వాహకుడిగా ఉన్న సిద్ధరాములుతో పాటు మరికొందరిని పోలీసులు అరెస్టు చేశారు. లింగ నిర్ధారణ కేసులో కౌసల్య ఆస్పత్రిని సీజ్ చేశారు. కొంత కాలం దందా నిలిచిపోయింది. అయితే బెయిల్‌పై వచ్చిన తర్వాత ఆస్పత్రి నిర్వాహకులు ఆధునిక హంగులతో భవనాన్ని నిర్మించి అందులో ఆస్పత్రిని ప్రారంభించారు. అదే ఆస్పత్రిలో శిశు విక్రయం జరిగినట్లు తేలడంతో పోలీసులు వైద్యుడితో సహా ఎనిమిది మందిని అరెస్టు చేశారు. చట్టవిరుద్ధ కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఆస్పత్రిపై కలెక్టర్‌తో పాటు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు నివేదిక పంపుతున్నట్లు ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఇదే విషయమై శనివారం రాత్రి ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో డాక్టర్ చంద్రశేఖర్ వివరణ కోరగా తమకు ఇప్పటి వరకు ఎలాంటి సమాచారం అందలేదని పేర్కొన్నారు. పోలీసు శాఖ నుంచి వచ్చిన నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

మూడు రాష్ట్రాల నుంచి..

లింగ నిర్ధారణ పరీక్షలు, అబార్షన్లకు అడ్డాగా మారిన పట్టణంలోని ఆ ఆస్పత్రికి రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచే కాకుండా మహారాష్ట్ర, కర్నాటక నుంచి కూడా వచ్చి స్కానింగ్ చేయించుకోవడం, ఆడపిల్ల అయితే అబార్షన్లు చేయించుకుని వెళ్తుంటారు. రోజూ ఆ ఆస్పత్రి వద్ద పదుల సంఖ్యలో కార్లు, ఇతర వాహనాల్లో వచ్చి పో తుండడాన్ని స్థానికులు చూసి విస్తుపోయేవారు. అధికారులను మేనేజ్ చేసుకుని అడ్డగోలు వ్యవహారం నడిపించారన్న ఆరోపణలున్నాయి. స్కానింగ్, అబార్షన్ల కోసం ఒక్కో ధర నిర్ణయించారు. ఆడ బిడ్డనా, మగబిడ్డనా తేల్చి చెప్పడానికి రూ. 25వేల వరకు తీసుకున్నారు. అబార్షన్ చేయాల్సి వస్తే మూడు నెల ల గర్భంతో అయితే రూ. 50వేల నుంచి రూ. 70వేల వరకు వసూలు చేశారని తెలుస్తోంది. కడుపులో పెరుగుతున్న బిడ్డ వయస్సు ఆధారంగా ధర పెంచేసి అబార్షన్లు చేశారన్న ఆరోపణలున్నాయి.

పెంపుడు జంతువులకు టీకా వేయించాలి

■ అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి



టీకాల కోసం తీసుకువచ్చిన శునకాలు



పశువైద్యశాలలో కుక్కకు టీకా వేస్తున్న జిల్లా పశువైద్యాధికారి రోహిత్‌రెడ్డి

కామారెడ్డి టౌన్: పెంపుడు జంతువులకు తప్పనిసరిగా టీకాలను వేయించాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం జూనోసిస్ డే సందర్భంగా జిల్లా కేంద్రంలోని పశువైద్యశాలలో ఉచిత టీకాల కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూనోటిక్ వ్యాధుల నివారణకు తగిన జాగ్రత్తలతో పాటు టీకాలు వేయించాలని సూచించారు. కుక్కకాటు వల్ల సంక్రమించే రేబిస్ అత్యంత ప్రమాదకరమైందని.. క్రమం తప్పకుండా కుక్కలకు యాంటీ రేబిస్ టీకా వేయించాలన్నారు. దేశంలో 30శాతం మరణాలు జూనోటిక్ వ్యాధులే కారణమవుతున్నాయని చెప్పారు. జిల్లా కేంద్రంలోని పశు వైద్యశాలలో 144 కుక్కలకు టీకాలను వేసినట్లు జిల్లా పశువైద్యాకారి రోహిత్‌రెడ్డి తెలిపారు. కుక్కకాటును అశ్రద్ధ చేయకూడదని మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ తెలిపారు. టీకాల కోసం ఆస్పత్రికి తీసుకు వచ్చిన వివిధ రకాల పెంపుడు శునకాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఏడీ డాక్టర్ సంజయ్‌కుమార్, 26వ వార్డు కౌన్సిలర్ మానస, పశు వైద్యులు దేవేందర్, రవికిరణ్, అనిల్‌రెడ్డి, సిబ్బంది సాయిరెడ్డి, నరేశ్, నితిన్, శ్రీనివాస్, బాబాగౌడ్, కిషన్ తదితరులు పాల్గొన్నారు.









క్లుప్తంగా

అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల నిరసన



మద్నూర్(జుక్కల్): అంగన్‌వాడి టీచర్ల రిటైర్మెంట్‌కు రూ. 2 లక్షలు, ఆయాలకు రూ. 1లక్ష చొప్పున చెల్లించా లని డిమాండ్ చేస్తూ శనివారం మండల కేంద్రంలోని ఐసీడీఎస్ సీడీపీవో కార్యాలయాన్ని టీచర్లు, ఆయాలు ముట్టడించారు. అంగన్ వాడి టీచర్లు, ఆయా ఐసీడీఎస్ కార్యాయం వద్ద బైఠాయించడంతో సీఐటీయు అధ్య క్షుడు సురేశ్ గొండ మద్దతు తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడి టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థులకు నోట్ పుస్తకాలు సిద్ధం



భిక్కనూరు : కామారెడ్డి జిల్లాలోని ప్రభుత్వ హాస్టళ్లలో ఉండే విద్యార్థులకు అవసరమైన నోట్ పుస్తకాలను అందించేందుకు ప్రభుత్వం భిక్కనూరు ప్రభుత్వ హాస్టళ్లకు శనివారం పంపించింది. జిల్లాలోని అన్ని ప్రభుత్వ హాస్టళ్లకు ఇక్కడి నుంచే నోట్ పుస్తకాలను వార్డెన్ల ద్వారా పంపిస్తామని భిక్కనూరు హాస్టళ్ల వార్డెన్ సునీత తెలిపారు.

సేవచేసే భాగ్యం రావడం అదృష్టం



భిక్కనూరు : ప్రజలకు సేవచేసే భాగ్యం కలుగడం తాను అదృష్టంగా భావిస్తున్నానని భిక్కనూరు మండల ఎంపీటీసీల ఫోరం మండల మాజీ కన్వీనర్ ద్యావర సాయిరెడ్డి అన్నారు. శనివారం ఆయనను తిప్పాపూర్ గ్రామస్తులు పదవీకాలం ముగిసినందున ఘనంగా సన్మానించారు. సింగిల్‌విండో చైర్మన్ ఎన్గు వెంకట్ రెడ్డి, మాజీ సర్పంచ్ స్వామి, మాజీ వైస్ ఎంపీపీ రాజయ్య,మాజీ చైర్మన్ వంగేటి చిన్న నర్స రెడ్డి తదితరులున్నారు.

బెల్ట్‌షాపు టెండర్లు నిలిపేయాలని వినతి



భిక్కనూరు : మండలంలోని జంగంపల్లిలో వీడీసీ ఆధ్వర్యంలో బెల్ట్‌షాప్ నిర్వహణ కోసం టెండర్లు నిర్వహించాలని చూస్తున్నారని వాటిని నిలిపేసి చర్యలు తీసుకోవాలని జంగంపల్లి గ్రామస్తులు శనివారం భిక్కనూరు ఎంపీడీవో కా ర్యాలయానికి తరలివచ్చారు. కొందరూ గ్రామపెద్దలు వీడీసీ పేరుతో మద్యం విక్రయించేందుకు టెండర్లు నిర్వహించేందుకు యత్నిస్తున్నారని వీటిని నివారించడంతో పాటు రాజ్యంగేతర శక్తిగా ఉన్న వీడీసీని రద్దు చేయాలని కోరారు. అలాగే ఆబ్కారీ శాఖ అధికారులకు కూడా ఈ విషయమై వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు నరేశ్‌మూర్తి, డీసీసీబీ డైరెక్టర్ గొండ్ల సిద్ధ రాములు, నేతలు ప్రకాష్‌గౌడ్, కొల్మి నర్సింలు తదితరులున్నారు.

దివ్యాంగుల పాట్లు..

- జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో దివ్యాంగుల అవస్థలు
- కన్నెత్తి చూడని ఉన్నతాధికారులు

కామారెడ్డి టౌన్ : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో దివ్యాంగుల కోసం ఏర్పాటు చేసిన వీల్‌చైర్లను ఆస్పత్రి సిబ్బంది చెత్త బుట్టలు, మందుల కాటన్ డబ్బాలు, ఇతర సామగ్రి మోసుకెళ్లేందుకు వినియోగిస్తున్నారు. అయితే ఆస్పత్రి వచ్చే దివ్యాంగులకు మాత్రం వీల్ చైర్‌లు లభించకపోవడంతో అవస్థలు పడుతూ ఆస్పత్రి లోపలికి, బయటకు వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నారు. శనివారం ఆస్పత్రి సిబ్బంది చెత్త బుట్టలను వీల్‌చైర్‌లో తీసుకెళ్తుండగా అదే సమయంలో నలుగురు దివ్యాంగులు నేలపై పాక్కుంటూ, ఇబ్బందులు పడుతూ వెళ్తున్న దృశ్యాలు 'సాక్షి' కెమెరాకు చిక్కాయి.



వీల్‌చైర్ అందుబాటులో లేకపోవడంతో అవస్థలు పడుతూ వెళ్తున్న దివ్యాంగుడు



జిల్లా కేంద్రంలోని జీజీహెచ్‌లో వీల్‌చైర్‌పై ఖాళీ చెత్తబుట్టలను తీసుకెళ్తున్న సిబ్బంది

సార్‌ను బదిలీ చేయవద్దు



శివాయిపల్లి గ్రామంలో పాఠశాల ఎదుట ధర్నా చేస్తున్న గ్రామస్తులు

- విద్యార్థులతో గ్రామస్తుల ర్యాలీ
- తరగతుల బహిష్కరణ
- డీఈవోకు వినతిపత్రం అందజేత



డీఈవోకు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

రాజంపేట : రాజంపేట మండలం శివాయిపల్లి గ్రామంలో గ్రామస్తులందరూ కలిసి బదిలీ అయిన ఉపాధ్యాయుడు స్వామిని తిరిగి తమ పాఠశాలకే కేటాయించాలని కోరుతూ శనివారం పాఠశాల ఎదుట ధర్నా చేపట్టారు. ఉపాధ్యాయుల బదిలీలో శివాయిపల్లి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు ముదాం స్వామి పొందుర్తి ప్రాథమిక పాఠశాలకు బదిలీ అయ్యారు. గ్రామంలో మూతబడిన పాఠశాలను గ్రామస్తులందరూ కృషితో 2019లో పాఠశాలను పున: ప్రారంభించి విజయవంతంగా కొనసాగేందుకు డిప్యూటేషన్ ఉపాధ్యాయులైన ముదాం స్వామి ఎంతో కృషి చేశారన్నారు. పొందుర్తికి పాఠశాలకు బదిలీ అయిన ముదాం స్వామిని తిరిగి తమ పాఠశాలకే డిప్యూటేషన్‌పై కేటాయించాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు. గ్రామస్తులు, విద్యార్థులు తల్లిదండ్రులు తరగతులను బహిష్కరించి విద్యార్థులతో కలిసి గ్రామంలో ర్యాలీ కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం డీఈవో రాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, వీడీసీ కమిటీ సభ్యులు, పిల్లల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయుడికి సన్మానం



రాజంపేట : రాజంపేట మండలం పెద్దయిపల్లి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు ఆకుల రమేశ్ ఉపాధ్యాయుల బదిలీల భాగంగా గాంధారి మండలం బ్రాహ్మణపల్లి గ్రామానికి బదిలీ అయ్యారు. దీంతో పెద్దయిపల్లి గ్రామస్తుల ఆధ్వర్యంలో శనివారం ఆకుల రమేశ్‌కు వీడ్కోలు సమావేశాన్ని నిర్వహించి ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం ఈశ్వరయ్య, కామిశెట్టి శ్రీనివాస్, మాజీ సర్పంచ్ శివవ్వ, ఎస్‌ఎంపీ చైర్మన్ గంగాధర్ తదితరులున్నారు.

కులం పేరుతో దూషించిన వ్యక్తిపై ఫిర్యాదు

గాంధారి: భూమి కోసం తనను కులం పేరుతో ఓ వ్యక్తి దూషించి దాడి చేశాడని ఆరోపిస్తూ మాతు సంగెం గ్రామానికి చెందిన సంగవ్వ పోలీసులకు శనివారం ఫిర్యాదు చేసింది. అదే గ్రామానికి చెందిన రాజేందర్ గ్రామ శివారులోని అసైన్డ్‌మెంట్ భూమిని సాగుచేస్తుంటే అభ్యంతరం తెలుపుతూ కులం పేరుతో దూషించాడన్నారు. ఈ విషయమై ఫిర్యాదు చేయడంతో భూమి విషయం కావడంతో తహసీల్దార్‌కు సమాచారం అందించామన్నారు. ఈ విషయమై తహసీల్దార్ సతీశ్‌రెడ్డిని వివరణ కోరగా సర్వే చేయించి విచారణ చేపడతామని పేర్కొన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో ఇంట్లో మంటలు

- తల్లీబిడ్డలను కాపాడిన ఫైర్ సిబ్బంది





ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలోని పద్మనగర్‌లో ఉన్న వనమాల కృష్ణ ఇంట్లో శనివారం రాత్రి షార్ట్ సర్క్యూట్ సంభవించి మంటలు వ్యాపించాయి. ఈ మంటల్లో తల్లీబిడ్డలు చిక్కుకున్నారు. స్థానికులు ఫైర్‌శాఖకు సమాచారం అందించారు. తాము ఘట న స్థలానికి చేరుకొని మంటల్లో చిక్కుకున్న తల్లి పావని, కుమారులు అవన్, ఆర్విలను కాపాడినట్లు ఫైర్ ఆఫీసర్ నర్సింగ్ రావు తెలిపారు. తాము రావడం ఆలస్యమైతే తల్లి, బిడ్డలు సజీవదహనం అయ్యేవారని పేర్కొన్నారు. సకాలంలో మంటలను ఆర్పి తల్లి, బిడ్డలను కాపాడిన ఫైర్ సిబ్బందిని స్థానికులు అభినందించారు. ఫైర్ సిబ్బంది ప్రశాంత్, తిరుపతి, సురేశ్ ఉన్నారు.

తల్లికి తలకొరివి పెట్టిన కుమార్తె

కామారెడ్డి అర్బన్: అనారోగ్యంతో మృతి చెందిన తల్లికి కుమార్తె తలకొరివి పెట్టి రుణం తీర్చుకుంది. కామారెడ్డి పట్టణం దేవునిపల్లికి చెందిన పూలపల్లి విజయలక్ష్మి(65)కి ఇద్దరు కుమార్తెలు. వీరికి పెళ్లిలు చేసి అత్తారింటికి పంపింది. కొన్నేళ్ల క్రితం భర్త మృతి చెందడంతో ఇంట్లో ఒంటరిగా ఉంటోంది. చిన్న కుమార్తె మమత భర్త ఉపాధి నిమిత్తం కువైట్‌కు వెళ్లడంతో వృద్ధాప్యంలో బాధపడుతున్న తల్లికి సపర్యలు చేస్తూ తల్లి వద్దే ఉంటోంది. శనివారం ఉదయం విజయలక్ష్మి ఆరోగ్యం క్షీణించి మృతి చెందింది. కుమారులు లేనందున తలకొరివి ఎవరు పెడతారన్న ప్రస్తావన రాగా తాను చేస్తానని ముందుకు వచ్చింది. తల్లికి కుమార్తె తలకొరివి పెట్టడం చూసి అక్కడున్న వారు కన్నీటి పర్యంతమయ్యారు.



తల్లి కర్మకాండ నిర్వహిస్తున్న మమత

ఇసుక టిప్పర్లు సీజ్



బాన్సువాడ: ఇసుకను అక్రమంగా తరలిస్తున్న మూడు టిప్పర్లను సీజ్ చేసినట్లు సీఐ కృష్ణ శనివారం పేర్కొన్నారు. బిచ్కుంద మండలం కతిగాం క్వారీ నుంచి ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న మూడు టిప్పర్లను తాడ్కోల్ శివారులో పట్టుకున్నట్లు తెలిపారు. టిప్పర్ల యజమాని షేక్ షాకీర్, డ్రైవర్లు సమీర్, అఫ్రోజ్, సయ్యద్ అమేర్‌లపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఎవరైనా ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తే కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. అలాగే బీర్కూర్ మంజీర ప్రాంతం నుంచి అనుమతులు లేకుండా తరలిస్తున్న రెండు ఇసుకను టిప్పర్లను తహసీల్దార్ లత పట్టుకున్నారు. టిప్పర్లకు రూ.20 వేల జరిమాన విధించినట్లు ఆమె పేర్కొన్నారు.

మూడు మడిగెలు..



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని జంబి హనుమన్ ఆలయానికి చెందిన మూడు మడిగెలను ఆలయ ఈవో రవీందర్ శనివారం సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ.. మడిగెల కిరాయి గత 25 నెలల నుంచి చెల్లించకపోవడంతో సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. మడిగెలు తీసుకున్నవారు సకాలంలో కిరాయి చెల్లించాలని సూచించారు. ఆయన వెంట ఆలయ సిబ్బంది ఉన్నారు.

ఒకరి అదృశ్యం

రెంజల్: మండలంలోని కందకుర్తికి చెందిన ఫెరోజ్‌ఖాన్ అదృశ్యమైనట్లు ఎస్సై సాయన్న శనివారం పేర్కొన్నారు. వివరాలిలా ఉన్నాయి. సెంట్రింగ్ పనులు చేసే అతను గత నెల 16న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబీకులు పలుచోట్ల గాలించినా ఆచూకీ లభించలేదు. భార్య ఫర్హానా బేగం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఆధార్ కేంద్రంలో చోరీ

ఇందల్వాయి: తిర్మన్‌పల్లి జీపీ కార్యాలయ భవనంలో నిర్వహిస్తున్న శాశ్వత ఆధార్ నమోదు కేంద్రంలో శుక్రవారం రాత్రి చోరీ జరిగినట్లు ఎస్సై మనోజ్ శనివారం తెలిపారు. పంచాయతీ మొదటి అంతస్తులో ఉన్న ఆధార్ కేంద్రం గది తాళం పగలగొట్టి అందులో ఉన్న ల్యాప్‌టాప్‌ని దుండగులు ఎత్తుకెళ్లారు. నిర్వాహకుడు గోపాల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

క్రైం కార్నర్

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరి మృతి

ఖలీల్‌వాడి: గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ఘటనలో అర్సపల్లికి చెందిన ఒకరు మృతి చెందినట్లు ఆరో టౌన్ ఎస్సై మొగులయ్య శనివారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. అర్సపల్లికి చెందిన ప్రవీణ్(45) కిరాణ షాప్ నిర్వహిస్తున్నాడు. శుక్రవారం రాత్రి కిరాణ సామాగ్రిని రోడ్డుపై నడుచుకుంటు తీసుకెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొన్నది. ఈ ఘటనలో మురికి కాలువలో పడ్డ ప్రవీణ్ మృతి చెందాడు. ఆ రోడ్డు గుండా చీకటి ఉండడంతో ఎవరూ గమనించలేదు. కొద్ది సేపటికి స్థానికులు మురికి కాలువలో మృతదేహం ఉందని తెలుసుకొని పోలీసులకు సమాచారం అందించారు. బాధిత కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలు..

బోధన్‌రూరల్: ప్రమాదవశాత్తు వేడినీరు పడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఓ వృద్ధురాలు మృతి చెందినట్లు ఎస్సై నాగనాథ్ శనివారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. సాలూర మండల కేంద్రానికి చెందిన నీలకంఠం లక్ష్మీబాయి(75)కి కుమారుడు, కుమార్తె ఉన్నారు. సాలూరలో ఉంటున్న కుమారుడి ఇంటికి మరమ్మతులు చేపడుతుండడంతో నాలుగు నెలల క్రితం హున్సలో ఉంటున్న కుమార్తె ఇంటికి వెళ్లింది. అక్కడ గత నెల 28న స్నానం కోసం బాత్‌రూంకు వెళ్తుండగా అక్కడే ఉన్న వేడినీరు ఆమెపై పడింది. ఈ ఘటనలో ఆమెకు తీవ్రగాయాలయ్యాయి. కుటుంబీకులు చికిత్స నిమిత్తం నిజామాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. కుమారుడు ఆంజనేయులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

రెండు కిలోల గంజాయి పట్టివేత

బిచ్కుంద(జుక్కల్): మండలంలోని గోపన్‌పల్లి చౌరస్తాలో బైక్‌పై తరలిస్తున్న రెండు కిలోల గంజాయిని పట్టుకున్నట్లు ఎస్సై మోహన్‌రెడ్డి శనివారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. గోపన్‌పల్లి చౌరస్తాలో శుక్రవారం రాత్రి వాహనాల తనిఖీ చేపడుతున్న సమయంలో పోచారం తండాకు చెందిన ముగ్గురు వ్యక్తులు బైక్‌పై వెళ్తుండగా వారి వద్ద ఉన్న బ్యాగును తనిఖీ చేయగా రెండు కిలోల గంజాయి పట్టుబడిందన్నారు. ముగ్గురిలో ఒకరిని అదుపులోకి తీసుకోగా ఇద్దరు పరారైనట్లు చెప్పారు. సదరు వ్యక్తిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించగా మరో ఇద్దరిని త్వరలో పట్టుకుంటామని ఎస్సై పేర్కొన్నారు.

న్యాయాధికారుల పదవులను భర్తీ చేయాలి

ఖలీల్‌వాడి: జిల్లా కోర్టు ప్రాంగణంలో ఖాళీగా ఉన్న న్యాయాధికారుల పదవులను భర్తీ చేయాలని పలువురు జిల్లా న్యాయవాదులు రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి, జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి శ్రీసుధకు శనివారం వినతిపత్రం అందజేశారు. అధికారిక పర్యటన నిమిత్తం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ అతిథి గృహంలో బస చేసిన ఆమెకు, రాష్ట్ర న్యాయమూర్తి, రాష్ట్ర న్యాయ సేవా సంస్థ చైర్మన్ జస్టిస్ సుజోయ్‌పాల్‌లను నిజామాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్‌మోహన్‌గౌడ్, సహచర బార్ ఉపాధ్యక్షుడు రాజు, ప్రధాన కార్యదర్శి వసంత్, కార్యదర్శి సురేశ్, కోశాధికారి దీపక్, పలువురు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. బార్ తరఫున పలు సమస్యలను పరిష్కారించాలని కోరుతూ వినతి పత్రం అందించారు. కోర్టుల సంఖ్య పెరిగిన నేపథ్యంలో ప్రతినిత్యం వందలాది మంది కక్షిదారులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది మూలంగా వచ్చే వాహనాలు, ప్రస్తుత జిల్లాకోర్టు ఆవరణ సరిపోక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు జగన్ పేర్కొన్నారు. కోర్టు అవసరాలరీత్యా ఓల్డ్ విద్యాశాఖ కార్యాలయ స్థలాన్ని న్యాయశాఖకు కేటాయించేలా కృషి చేయాలని కోరారు. అనంతరం వినతిపత్రాన్ని పరిశీలించిన జస్టిస్ శ్రీసుధ సానుకూలంగా స్పందించారు. తాను జిల్లా అదనపు జడ్జి, జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా విధులు నిర్వహించానని, కోర్టులో ఉన్న సమస్యలు తెలుసని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీతా కుంచాల, రాష్ట్ర న్యాయసేవా సంస్థసభ్య కార్యదర్శి పంచాక్షరి, న్యాయమూర్తులు, న్యాయవాదులు గోవర్ధన్, పడిగెల వెంకటేశ్వర్, మానిక్‌రాజ్, కవితరెడ్డి, నారాయణ ఉన్నారు.



హైకోర్టు న్యాయమూర్తికి వినతిపత్రం అందిస్తున్న న్యాయవాదులు

ఉద్యోగాలు ఇప్పిస్తానని మోసం

చిన్నారులకు పాఠాలు చెప్పే ఓ టీచర్‌కు అక్రమంగా సంపాదించాలనే దుర్బుద్ధి కలిగింది. దీంతో నిరుద్యోగులను ఆసరా చేసుకొని ఉద్యోగాలు, రుణాలు ఇప్పిస్తానంటూ నమ్మించి రూ. లక్షల్లో వసూలు చేసింది. ఆమె మాటలు నమ్మిన పలువురు బాధితులు డబ్బులు అప్పగించారు. తీరా ఏడు నెలలు గడుస్తున్నా ఉద్యోగాలు, రుణాలు ఇప్పించక పోవడంతో ఆమె చేసిన మోసాన్ని గుర్తించిన బాధితులు లబోదిబో మంటున్నారు.





వినతిపత్రం అందిస్తున్న బాధితులు, మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న బాధితులు

- రూ. 6లక్షలు వసూలు చేసిన అంగన్‌వాడీ టీచర్
- ఐసీడీఎస్ అర్బన్ సీడీపీవోకు బాధితుల ఫిర్యాదు

నిజామాబాద్‌నాగారం: నగరంలోని చంద్రశేఖర్ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో పనిచేస్తున్న టీచర్ మేరీ తమను మోసం చేసిందంటు పలువురు బాధితులు మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపి ఐసీడీఎస్ అధికారులకు శనివారం ఫిర్యాదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. నిజామాబాద్, మాక్లూర్ మండలాల్లోని చుట్టు పక్కల గ్రామాల్లోని నిరుద్యోగులు, మహిళలకు అంగన్‌వాడీ టీచర్ మేరీ ఉద్యోగాలు, రుణాలు ఇప్పిస్తానంటూ నమ్మించి డబ్బులు వసూలు చేసింది. గతేడాది నవంబర్‌లో మున్సిపల్ కార్యాలయంలో ఉద్యోగాలు ఇప్పిస్తానని రూ. 30వేల చొప్పున 20మంది నుంచి సుమారు రూ. 6లక్షలు వసూలు చేసింది. అంతేకాకుండా రుణాలు ఇప్పిస్తానని తన కు రూ. 3వేలు ఇస్తే రూ. 3లక్షలు చొప్పున ఇప్పిస్తానంటు నమ్మించి సుమారు 50మంది నుంచి రూ. 1లక్షా50వేలు వసూలు చేసింది. ఈ నగదును ఆమెకు ఫోన్ పే, గూగుల్‌పే ద్వారా బాధితులు చెల్లించారు. గత ఏడు నెలలుగా ఉద్యోగాలు, రుణాల విషయమై ఆమె చుట్టూ ఏడు నెలలుగా తిరుగుతున్నా తప్పించుకు తిరుగుతోంది. దీంతో తాము మోసపోయానట్లు బాధితులు గుర్తించి జిల్లా అధికారులకు ఈ విషయమై విన్నవించారు. ఇన్‌చార్జి సీడీపీవో నందినికి ఫోన్‌లో సమస్యను విన్నవించారు. కలెక్టర్‌కు ప్రజావాణిలో సైతం ఫిర్యాదు చేస్తామని సుమలత, ప్రశాంతి, లక్ష్మి, సవిత తదితరులు పేర్కొన్నారు.

న్యాయం చేయాలి



ఉద్యోగం ఇప్పిస్తానని మాయమాటలు చెప్పి మోసం చేసింది. 20మందికి పైగా రూ. 30 వేలు వసూలు చేసింది. అంగన్‌వాడీ టీచర్ మేరీపై అధికారులు చర్యలు తీసుకొని మాకు న్యాయం చేయాలి.

– సుమలత, బాధితురాలు

టీచర్‌పై చర్యలు తీసుకోవాలి



మాలాంటి ఎంతోమంది అమయాకులను మోసం చేసిన అంగన్‌వాటీ టీచర్ మేరీపై చర్యలు తీసుకోవాలి. మా డబ్బులు మాకు తిరిగి ఇప్పించాలి. అధికారులు శాఖపరమైన చర్యలు తీసుకొవాలి.

– ప్రశాంతి, బాధితురాలు

మహిళను ఢీకొన్న కారు

- పరిస్థితి విషమం
- డ్రైవర్‌ను చితకబాదిన గ్రామస్తులు
- ఆస్పత్రికి తరలింపు



తీవ్రగాయాలై పడిపోయిన కళావతి



కారు డ్రైవర్‌ను ఆస్పత్రికి తరలిస్తున్న పోలీసులు

మాక్లూర్: పొలంలో నారు వేసేందుకు రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న ఓ మహిళను వెనుక నుంచి వచ్చిన కారు వేగంగా ఢీకొన్నది. ఈ ఘటనలో ఆమెకు తీవ్రగాయాలు కాగా పరిస్థితి విషమంగా ఉంది. ఘటనకు సంబంధించి ఎస్సై సుధీర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. ముల్లంగి(బి) గ్రామానికి చెందిన కళావతి గ్రామ శివారులో పొలంలో నారు వేసేందుకు శనివారం ఉదయం రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తోంది. అదే సమయంలో జిల్లా కేంద్రానికి చెందిన జిలుకర ప్రసాద్ బొంకన్‌పల్లి నుంచి నిజామాబాద్‌కు మితిమీరిన వేగంతో వెళ్తుండగా ఆమెను వెనుక నుంచి ఢీకొన్నాడు. ఈ ఘటనలో ఆమెపై నుంచి కారు వెళ్లడంతో పరిస్థితి విషమంగా మారింది. కళావతిని ఢీకొన్న కారు పొలాల్లోకి దూసుకెళ్లింది. గమనించిన స్థానికులు, రైతులు పెద్ద ఎత్తున కేకలు వేస్తూ డ్రైవర్‌ను కిందికి దిగాలని వారించారు. కారులో ఉన్న ప్రసాద్ కారు ఆపకుండా గ్రామస్తుల పైకి వేగంగా నడిపేందుకు ప్రయత్నించాడు. దీంతో ఆగ్రహానికి గురైన గ్రామస్తులు డ్రైవర్‌ను బయటకు తీసి చితకబాదారు. అపస్మారక స్థితికి వెళ్లడంతో ఆస్పత్రికి తరలించారు. కళావతి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

జీవితంపై విరక్తి చెంది ఒకరి ఆత్మహత్య

కామారెడ్డి క్రైం: అనారోగ్యం, కుటుంబ సమస్యల కారణంగా జీవితంపై విరక్తి చెందిన ఒకరు ఆత్మహత్య చేసుకున్న ఘటన కామారెడ్డి మండలం రామేశ్వర్‌పల్లిలో శనివారం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన లింగ చంద్రం(53) గ్రామంలో కిరాణం దుకాణం నడిపిస్తున్నాడు. కొద్ది రోజులుగా వెన్నుపూస సంబంధిత సమస్యతో ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నాడు. ఆన్‌లైన్ గేమ్‌ల కారణంగా అప్పుల పాలైన అతడి కుమారుడు రెండు రోజుల క్రితం ఎవరికీ చెప్పకుండా ఎక్కడికో వెళ్లిపోయాడు. శనివారం ఉదయం చంద్రం భార్య అరుణ, కోడలు కలిసి కామారెడ్డికి వచ్చారు. మధ్యాహ్నం సమయంలో ఇంటికి వచ్చేసరికి చంద్రం తన ఇంట్లోని వెనుక గదిలోని ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనా స్థలాన్ని దేవునిపల్లి పోలీసులు పరిశీలించి విచారణ చేపట్టారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజు పేర్కొన్నారు.

భార్య కాపురానికి రావడం లేదని ..

బిచ్కుంద(జుక్కల్): భార్య కాపురానికి రావడం లేదని ఒకరు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల కేంద్రంలో శనివారం చోటు చేసుకుంది. ఎస్సై మోహన్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన కుమ్మరి సాయిలు(30)కు భార్య మధ్య కొన్ని నెలలుగా గొడవలు జరుగుతున్నాయి. దీంతో ఆమె తన తల్లిగారింటికి వెళ్లిపోయింది. భార్య కాపురానికి రావడం లేదని మనస్తాపానికి గురైన సాయిలు గ్రామ శివారులోని గిద్ద చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లి ఆశవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ప్రైవేట్ లైన్‌మన్‌కు గాయాలు

ఆర్మూర్‌టౌన్: మండలంలో గోవింద్‌పేట్‌లో శనివారం చోటు చేసుకున్న విద్యుత్ ప్రమాదంలో ప్రైవేట్ లైన్‌మన్ కొత్తూర్ సాయిలుకు గాయాలయ్యాయి. గ్రామంలోని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మరమ్మతులు చేపడుతుండగా సమీపంలోని 11కేవీ విద్యుత్ తీగల నుంచి విద్యుత్ సరఫరా కావడంతో సాయిలు విద్యుదాఘాతం సంభవించి ఎడమకాలికి గాయాలయ్యాయి. గమనించి స్థానికులు ఆర్మూర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా మెరుగైన చికిత్స కోసం జిల్లాలోని ఆస్పత్రికి తరలించారు. కాగా సాయిలు చికిత్స కోసం అయ్యే ఖర్చును స్థానిక ట్రాన్స్‌కో లైన్‌మన్ భరించనున్నట్లు తెలిసింది.



చికిత్స పొందుతున్న సాయిలు